ప్రజాశక్తి
గురువారం 10 ఏప్రిల్ 2025






సమస్యలపై మహిళలతో మాట్లాడుతున్న మంత్రి కేశవ్

# సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

## రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బెళుగుప్పలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజాశక్తి-బెళుగుప్ప**

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రంలో పరిపాలన సాగుతోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. బుధవారం బెళుగుప్ప మండలంలో విస్తృతంగా పర్యటించారు. కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్‌తో కలిసి పలు అభివృద్ధి పనులను చేపట్టారు. మండల కేంద్రంలోని వాసవి కల్యాణ మండపం వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే పనులన్నీ పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకుని పని చేస్తున్నామని తెలిపారు. 70 రోజుల్లో హంద్రీనీవా కాలువ వెడల్పును పూర్తి చేసేలా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఉరవకొండ నియోజకవర్గంలోని హంద్రీనీవా కాలువకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక ప్రాజెక్టుకు రూ.3,800 కోట్లు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. వైసిపి పాలనలో హంద్రీనీవాకు సంబంధించి ఒక గంప మన్ను కూడా తీయలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించి రాష్ట్రంలో వచ్చే ఆదాయం, పన్ను వసూలు ఆదాయం మొత్తం జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి, పాత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలు కట్టేందుకు సరిపోతోందని తెలిపారు. ఒక్క రూపాయి కూడా మిగులు లేదన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమం, అభివృద్ధి నినాదంతో ముందుకెళ్తున్నామన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న లోప పోషణ రహిత అనంత, ఏడవ పౌష్టికాహార పక్షోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎనిమిదో తరగతి చదువుతున్న కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థినులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎ.మాలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఒ వసంతబాబు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, ఎంపిపి పెద్దన్న, సర్పంచి సాలీబాయి, వైస్ ఎంపీపీ పుష్పావతి, ఎంపీటీసీ శకుంతలమ్మ, సిపిఒ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా పరిషత్ సిఈఓ రామచంద్రారెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులు ప్రారంభం**

ఉరవకొండ నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని మండలాల్లో అభివృద్ధికి బాటలు వేసేలా పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం, బిపిహెచ్, సిసిరోడ్డును కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్‌తో కలిపి ప్రారంభించారు. ముందుగా గుండ్లపల్లి రోడ్డులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.75 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడే రూ.50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (బిపిహెచ్)ను ప్రారంభించారు. బెలుగుప్ప మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రూ.16.71 లక్షలతో ఏర్పాటు చేసిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఆవులన్న గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయడంపై గ్రామస్తులు 'థాంక్యూ మినిస్టర్ సార్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి పెద్దన్న, ఆర్అండ్‌బి ఎస్ఈ రాజగోపాల్, డిఇ బాల కాటమయ్య, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, మెడికల్ అధికారులు డా॥కార్తీక్ కుమార్ రెడ్డి, డా॥ప్రియాంక, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో అర్జీల పరిశీలన : కలెక్టర్



**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

వివిధ సమస్యలపై పిజిఆర్ఎస్‌లో ప్రజలు అందిందచే అర్జీలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ సెక్టార్, రీసర్వే, తదితర అంశాలపై ఆర్డీవోలు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లతో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలను నియోజకవర్గ ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాలన్నారు. అందుకు సంబంధించిన నివేదికలను విధిగా ఈ ఆఫీస్‌లోనే కలెక్టర్‌కు సమర్పించాల్సి ఉంటుందన్నారు. వీరితోపాటు ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సైతం క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేపట్టాలన్నారు. సర్వే శాఖ సహాయ సంచాలకులు వారానికి ఒక పిటిషన్ చొప్పున పరిష్కరించాలన్నారు. గడువులోపు నాణ్యతగా పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం సాయంత్రం అనంత అభ్యాసం కింద చుక్కల భూమి, 22ఎ అంశాలకు సంబంధించి తహశీల్దార్లు, ఆర్డీవోలు, డీటీలు, సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఆ శిక్షణలో తాను, జెసి కూడా పాల్గొంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకష్ణారెడ్డి, ఆర్డీవోలు కేశవనాయుడు, ఆర్‌బిఎస్‌కె.శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు తిప్పేనాయక్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# నేడు మంత్రి కొల్లు రవీంద్ర రాక



**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం నాడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాకు రానున్నారు. ఈ మేరకు మంత్రి పర్యటన వివరాలను అధికారులు తెలియజేశారు. గురువారం ఉదయం అనంతపురంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2-45 గంటలకు గోరంట్ల మండలం పాలసముద్రం క్రాస్‌కు చేరుకుంటారన్నారు. అక్కడ ఏపీఎస్ బిసిఎల్ పరిపాలన విభాగాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 4 గంటల వరకు నాసిన్ కేంద్రం వద్ద అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బెంగళూరుకు బయలుదేరి వెళ్తారు.



గుంతకల్లులో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలుపుతున్న మహిళలు




గుత్తిలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

# భారాలు మోపడమే మోడీ పాలన

## ◆ పేదల నడ్డి విరిచేలా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ◆ సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు

**కేంద్రంలోని ప్రధాన నరేంద్ర మోడీ పేదలపై భారాల వేయడమే విధానంగా పరిపాలన సాగిస్తున్నారని సిపిఎం నాయకులు విమర్శించారు. ఇటీవల పెంచిన గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం నిరసన తెలిపారు.**

**ప్రజాశక్తి-గుంతకల్లు, ఉరవకొండ, గుత్తి**

**గుంతకల్లు :** పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, ఐద్వా ఆధ్వర్యంలో పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద కట్టెల పొయ్యి ఏర్పాటు చేసి వంట చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రంగమ్మ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నా మోడీ ప్రభుత్వం వంట గ్యాస్ ధర రూ. 50 పెంచడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు, ఇంటి పన్నులు, నిత్యావసరాల ధరలు అధికంగా పెంచిందన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న దశలో ధరల పెంపు ప్రజల నెత్తిన బండ వేయడమే అన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వంట గ్యాస్ ధరలను తగ్గించాలని లేనిచో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్ర, సభ్యులు రామునాయక్, లక్ష్మీబాయి, చంద్రశేఖర్, అబ్దుల్లా, మహిళా సంఘం నాయకులు షకీరా, సరస్వతి, లక్ష్మీ, భాగ్యమ్మ, రెహమత్‌బీ, హుస్సేన్‌బి, సుజాత, ప్రజా సంఘాల నాయకులు వెంకీ, ఈరన్న, నాగరాజు, డేనియల్, జాషువా, శంకరయ్య, బాషా పాల్గొన్నారు.

**ఉరవకొండ :** సిపిఎం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పెద్ద ముష్టూరు వెంకటేశులు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర సరుకులు ధరల విపరీతంగా పెరగడంతో అన్ని వర్గాల ప్రజలతో పాటు చిన్న, సన్నకారు రైతులకు కుటుంబ పోషణ భారమైందన్నారు. ఇలాంటి సమయంలో సిలిండర్‌పై రూ. 50 పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు. ధరల పెంపుపై రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు స్పందించకపోవడం శోచనీయ మన్నారు. 11 గంటలైనా రెవెన్యూ కార్యాలయంలో ఒక్క అధికారి కూడా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ గేటు వద్ద వినతి పత్రం పెట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిద్ధప్ప, రామాంజనేయులునాయక్, రవి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

**గుత్తి :** పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్తు ఛార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ కూడలిలో ఖాళీ సిలిండర్లతో వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు, హామీలను విస్మరించి విద్యుత్ ఛార్జీలు, ఇంటి పన్నులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.1500 ఏమయ్యాయని ప్రశ్నించారు. ఉచిత గ్యాస్ కూడా కొందరికే వర్తిస్తుందన్నారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించి, ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు రేవతి, కవిత, డివైఎఫ్ఐ నాయకులు అశోక్, కృష్ణవేణి, శృతి, సిఐటియు నాయకులు బాలగిరి, నాగరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# 'మైక్రో ఆర్టిస్టు' మహిత

- ◆ పెన్సిల్‌లెడ్‌పై ప్రముఖుల జీవిత చరిత్రలు
- ◆ అబ్బురపరుస్తున్న యువతి కళ
- ◆ విన్సెంట్ ఫెర్రర్ జీవిత చరిత్ర అందజేత




పెన్సిల్‌లెడ్‌పై జీవిత విశేషాలను తయారు చేస్తున్న మహిత

**బాపట్ల జిల్లా చీరలకు చెందిన మహిత అనే యువతి పెన్సిల్ లెడ్‌పై ప్రముఖుల జీవిత చరిత్రలను రచించి అబ్బురపరుస్తోంది. ఈ రకంగా పెన్సిల్ లెడ్‌పై విన్సెంట్ ఫెర్రర్ జీవిత చరిత్రను రచించి బుధవారం నాడు విన్సెంట్ ఫెర్రర్ జయంతి సందర్భంగా ఆర్డీటీ అన్నె ఫెర్రర్‌కు అందజేయడానికి అనంతపురం విచ్చేసింది. ఈ సందర్భంగా ఆమె తన అనుభవాలను ప్రజాశక్తితో పంచుకున్నారు.**

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

చీరాలకు చెందిన మహిత అక్కడి సిఎస్ఆర్ శర్మ కళాశాలలో బిఎ సైకాలజీ చదువుతోంది. తండ్రి నరసింహారావు ఆటో డ్రైవరు కాగా, తల్లి బ్రహ్మరాంభ గృహిణి. కోవిడ్ సమయంలో ఖాళీగా ఉండటంతో ఆ సమయాన్ని వృథా చేయరాదన్న ఉద్దేశంతో బియ్యపు గింజపై జాతీయ పతాకం గీయడం వంటివి చేసింది. బాగున్నాయని తల్లిదండ్రులు, సన్నిహితులు ప్రోత్సహించడంతో కొత్తగా ఉండాలని ఆలోచించి పెన్సిల్‌ను తీసుకుని పూర్తిగా చెక్కి అందులోనున్న లెడ్‌పై అక్షరాలు రాయడం మొదలు పెట్టింది. క్రమంగా అందులో బాగా ప్రావీణ్యత రావడంతో ప్రముఖుల జీవిత చరిత్రలు రాస్తే ఎలాగుంటుందని భావించి రాయడం మొదలు పెట్టింది. ఆ చిన్న లెడ్‌పై అతిచిన్న అక్షరాలను చెక్కి రాయడం అందరినీ ఆకర్షిస్తోంది.

**ఇప్పటి వరకు రచించినవి**

మొట్టమొదట రచించడం ప్రారంభించాక మొదట భవద్గీతను తెలుగులో రచించింది. ఆ తరువాత అంబేద్కర్, నెల్సన్ మండేలా జీవిత చరిత్రలోపాటు పొట్టిశ్రీరాములు జీవిత చరిత్రను రచించింది. వీటితోపాటు సత్యసాయి బాబా, కరుణానిధి, ఎన్టీఆర్, వైఎస్ఆర్, ట్రంప్ జీవిత చరిత్రలను రచించింది. వాటిని ఫొటో ఫ్రేమ్‌లపై చక్కగా అమర్చి ఆయా ప్రముఖులకు సంబంధించిన వారికి అందజేసింది.

**అభినందనలు అందినప్పుడు ఆనందంగా ఉంటుంది : మహిత**

తాను ప్రముఖుల జీవత చరిత్రలను పెన్సిల్ లెడ్‌పై రచించి ప్రముఖులకు కుటుంబ సభ్యులకు అందజేసినప్పుడు లభిస్తున్న అభినందనలు ఆనందిస్తున్నాయి. కరుణానిధి జీవిత చరిత్రను స్టాలిన్‌కు అందజేసినప్పుడు వారు శాలువ కప్పి అభినందించడం చాలా ఆనందమనించింది. ఎన్టీఆర్ జీవిత చరిత్రను బాలకృష్ణకు అందజేసినప్పుడు ఆయన ఎంతగానో అభినందించారు. భవిష్యత్తులో మరింత మంది జీవిత విశేషాలను ఇదే విధంగా తయారు చేస్తాను.

# క్షమాపణ చెప్పకపోతే రాజకీయ యుద్ధం చేస్తాం

## బిసి ఉద్యోగిపై జగన్ మాటలు దారుణం - ప్రభుత్వ విప్ కాలవ, ఎమ్మెల్యేలు అమిలినేని, దగ్గుపాటి

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**




విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి ఎమ్మెల్యేలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బిసి వ్యక్తి మృతిని రాజకీయం చేస్తూ బిసి పోలీసు అధికారిని అమర్యాదగా మాట్లాడారని, ఆయనకు బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే జగన్‌పై తాము రాజకీయ యుద్ధం కేస్తామని టిడిపి ఎమ్మెల్యేలు ప్రకటించారు. జగన్ పర్యటన నేపథ్యంలో ఆయన విమర్శలను తిప్పికొడుతూ బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ పాపిరెడ్డిపల్లిలో కుటప్త్రబ లింగమయ్య హత్య బాధాకరం అన్నారు. రాజకీయాలకు అతీతంగా లింగమయ్య హత్యను టిడిపి ఎమ్మెల్యేలుగా తామంతా ఖండించామన్నారు. ఈ కేసులో నిందితులను వెంటనే అరెస్టు కూడా చేయించినట్లు చెప్పారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించే పేరుతో చేసిన హడావుడి అత్యంత హేయంగా ఉందన్నారు. పోలీసులను బట్టలూడదీసి కొడతామంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు క్షమించరానివన్నారు. బిసి పోలీసు అధికారి సుధాకర్ యాదవ్‌ను అవమానకరంగా దూషించారన్నారు. ఐదేళ్ల పాటు జిల్లాలో వైసిపి నాయకులు సృష్టించిన దౌర్జన్యాలను ఇంకా జిల్లా ప్రజలు ఎవరూ మర్చిపోలేదన్నారు. జగన్ పర్యటనలో వైసిపి మద్దతుదారులు పోలీసులపై దాడులు చేశారన్నారు. ఈ దాడుల్లో పోలీసులు గాయపడ్డారన్నారు. దాడికి కారణం అయిన వారందరిపై కేసులు నమోదు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకోవడమే జగన్ లక్ష్యం అన్నట్లుగా ఉందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ సొంత తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్ర ప్రజలు కార్యకర్తలు ఏమి న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. పోలీసుల రక్షణ లేనిదే జిల్లాకు వచ్చి బెంగళూరుకు వెళ్లగలిగాడా అంటూ నిలదీశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ పాల్గొన్నారు.




**పోలీసులపై దూషణలు సరికాదు**

**ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ**

**బుక్కరాయసముద్రం :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమైన చర్యని, తక్షణం ఆయన పోలీసులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జగన్ మంగళవారం నాడు పాపిరెడ్డిపల్లి గ్రామంలో లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన సమయంలో పోలీసులను గుడ్డలూడదీసి కొడతామంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. పరామర్శించేందుకు వచ్చిన వ్యక్తి ఇలా మాట్లాడడం సరికాదన్నారు. కూటమి పాలనలో పోలీసులు సమన్యాయంతో పని చేస్తున్నారని చెప్పారు. అలాంటి పోలీసులను జగన్ కించపరుస్తూ మాట్లాడడం దుర్మార్గం అన్నారు. పోలీసు వ్యవస్థలో మహిళలున్నారన్న విషయాన్ని జగన్ గుర్తించుకుని మాట్లాడితే బాగుంటుందన్నారు. సహజ మరణానికి రాజకీయ రంగు పులిమి కక్షలకు ఆజ్యం పోయడం సరికాదన్నారు. పులివెందుల రౌడీయిజాన్ని అన్ని నియోజకవర్గాల్లో చేయాలంటూ కుదరదన్న విసయాన్ని జగన్ గుర్తించుకోవాలన్నారు. అధికారం కోసం శవరాజకీయాలు చేసే పద్ధతిని జగన్ మానుకోవాలని హితవు పలికారు.

# ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా శేషారెడ్డి



శేషారెడ్డి

**ప్రజాశక్తి-యల్లనూరు**

యల్లనూరు మండల తహశీల్దార్ రాజ ఇటీవల సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో పుట్లూరు తహశీల్దార్ శేషారెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమిస్తూ ఆర్డీవో కేశవ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శేషారెడ్డి బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రేషన్‌కార్డుదారులు అందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

# ట్రాక్టర్ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

**ప్రజాశక్తి-యల్లనూరు**

మండలంలోని రైతులు వ్యవసాయ ట్రాక్టర్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పనిముట్లకు సంబంధించి గత సంవత్సరం బడ్జెట్‌లో రూ.5లక్షల మిగులు ఉందన్నారు. వాటికి సరిపడా పరికరాలను అందిస్తామని చెప్పారు. దరఖాస్తు చేసుకునేందుకు రెండు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు.

# యల్లనూరు ఈసీగా సత్యమూర్తి


**ప్రజాశక్తి-యల్లనూరు**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం యల్లనూరు ఈసీగా సత్యమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న బబులు యాడికి మండలానికి బదిలీ అయ్యారు. ఇదే కార్యాలయంలో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్‌లు శ్రీనివాసులు పెద్దపప్పూరు, బాషా నార్పలకు, శంకర్ పుట్లూరు, ప్రతాప్ తాడిపత్రికి బదిలీ అయ్యారు.

బదిలీపై వెళ్తున్న టెక్నికల్ అసిస్టెంట్‌ల మండలంలో ఉపాధి హామీలో నిర్వహించిన సేవలు మరపురానివని ఫీల్డ్‌అసిస్టెంట్‌లు కొనియాడారు. విధి నిర్వహణలో అందరూ అంకితభావంతో పని చేసి ముందుకెళ్తే సత్ఫలితాలు వస్తాయని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వాసుదేవర రెడ్డి తెలిపారు.

# సైన్స్ ఉద్యమంలో శ్రీపతి సేవలు మరువలేనివి

## సంతాపసభలో జెవివి రాష్ట్ర అధ్యక్షులు డా॥ఎం.గేయానంద్




శ్రీపతి సంతాప సభలో ప్రసంగిస్తున్న డా॥ఎం.గేయానంద్

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

ఉమ్మడి జిల్లాలో ప్రజాసైన్స్ ఉద్యమంలో శ్రీపతి చేసిన సేవలు మరువలేనివని జెవివి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ఎం.గేయానంద్ తెలిపారు. ఇటీవల గుండెపోటుతో హఠాత్తుగా మరణించిన శ్రీపతి సంతాపసభను జెవివి నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సంగమేష్ నగర్‌లోని జెవివి కార్యాలయంలో నిర్వహించారు. జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ సాకే భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గేయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శ్రీపతి 20 సంవత్సరాలుగా శాస్త్రీయ దక్పథం కోసం జరిగిన ప్రజాసైన్స్ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారి తెలిపారు. జెవివి అభివద్ధికి ఎంతో కషి చేశారని తెలిపారు. ఆయన ఆశయాల కోసం కషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెవివి మాజీ రాష్ట్ర అధ్యక్షులు రంగన్న, ఐద్వా రాష్ట్ర రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, గౌరవాధ్యక్షులు రమణయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జెవివి జిల్లా నాయకులు డాక్టర్ పి.ప్రసూన, హమ్మద్ జిలాని, రామిరెడ్డి వీరరాజు, తిరుపాలు, ముత్యాలు, లక్ష్మీనారాయణ, ప్రసాద్, రాధా, గోపాల్, రాఘవేంద్ర, శ్రీపతి మిత్రులు, సహచరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

**ప్రజాశక్తి-యల్లనూరు**

మదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, వాటి నిర్మూలనపై బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. తిమ్మం పల్లి, వాసపురం, బుక్కపురం, యల్లనూరు తదితర గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో యల్లనూరు ప్రాథమిక వైద్యుడు లోకేష్ కుమార్ హాజరై మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు తెలియజేశారు. మాదక ద్రవ్యాల వాడడం వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

# ఇంజినీరింగ్ కళాశాలల వేధింపులు ఆపండి

## జెఎన్‌టియు వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా



జెఎన్‌టియు వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న ప్రయివేట్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జెఎన్‌టియు విసి భవనం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఉపకులపతి సుదర్శన్ రావుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓతూరు పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి మాట్లాడుతూ గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని అనంతపురం జెఎన్‌టియు పరిధిలోని కొన్ని ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలు విద్యార్థులను వేధిస్తున్నారని చెప్పారు. గత విద్యా సంవత్సరంలోని బకాయిలు చెల్లిస్తేనే పరీక్ష ఫీజులు కట్టించుకుంటామని లేకపోతే కట్టించుకోవమని బెదిరిస్తున్నారని చెప్పారు. మంత్రి నారా లోకేష్ ప్రకటించిన మేరకు బకాయిలన్నింటినీ చెల్లించాలని కోరారు. స్పందించిన వీసీ సుదర్శన్ రావు మాట్లాడుతూ కళాశాలల ఫీజులతో సంబంధం లేకుండా పరీక్ష ఫీజులు కట్టించుకునేలా ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు సోము, నగర నాయకులు విజయ్, సాయి, అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పిటిసిలో క్రీడాకారుల ఆందోళన

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అనంతపురం పిటిసిలో క్రీడాకారులను అనుమతించాలని కోరుతూ పిటిసి మైదానంలో క్రీడాకారులు బుధవారం సాయంత్రం ధర్నా చేపట్టారు. వీరికి సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, క్రీడాకారుల సంఘం నాయకులు మాట్లాడుతూ అనంతపురంలో క్రీడాకారులకు నిలయంగా పిటిసి ఉందన్నారు. అలాంటి మైదానంలో క్రీడలు ఆడకుండా క్రీడాకారులను పోలసులు అడ్డుకోవడం తగదన్నారు. క్రీడాకారులను అనుమతించే ప్రసక్తే లేదంటూ డీఎస్పీ కోటిరెడ్డి చెప్పడం సరికాదన్నారు. క్రీడా మైదానంపై పోలీసుల పెత్తనం ఏమిటని నిలదీశారు. సాతంత్ర సమరయోధుడు నీలం సంజీవరెడ్డి పేరును కూడా మార్చేందుకు డీఎస్పీ ప్రయత్నిస్తున్నారని ఇది సరికాదన్నారు. పిటిసిలోకి క్రీడాకారులను అనుమతించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాత్రి 10 గంటల వరకు ఆందోళన కొనసాగింది.



పిటిసి వద్ద ఆందోళన చేస్తున్న క్రీడాకారులు

# మార్కెట్ యార్డులో మోసాలు సాగనివ్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం మార్కెట్ యార్డులో ఇకపై మోసాలు సాగనివ్వమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. యార్డులో ఐదుగురు వ్యాపారులు ఆన్‌లైన్ పేరుతో రైతులను దగా చేస్తున్నారు. బయ ట మార్కెట్‌లో టన్ను చీనీ రూ. 50 వేలు ఉండగా ఇక్కడ రూ. 20 నుంచి రూ. 25 వేలు వచ్చేలా చూస్తున్నారు. దీనికి తోడు రైతుల మధ్య పోటీ పెడుతూ వారిని దగా చేస్తున్నారు. ఈ విషయాలన్నీ తెలుసుకున్న ఎమ్మెల్యే బుధవారం నగరంలోని మార్కెట్ యార్డును సందర్శించి అక్కడ మోసాలని బట్టబయలు చేశారు. ఎంతమంది వ్యాపారులు పంట కొనుగోలు చేస్తున్నారని మార్కెట్ యార్డ్ సెక్రటరీని ప్రశ్నించగా 42 మంది దాకా ఉన్నారని చెప్పారు. దీంతో నెల రోజుల నుంచి జరిగిన వ్యాపార లావాదేవీల రికార్డులను బయటకి తీయించగా అందులో కేవలం ఐదుగురు మాత్రమే పంట కొనుగోలు చేస్తున్నారని తేలింది. అలాగే 4 శాతం కమీషన్ వసూలు చేయాల్సి ఉండగా 10 శాతం వరకు వసూలు చేస్తున్నట్లు రైతులు వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే మార్కెట్ యార్డ్‌లో మీరు గాడిదలు కాస్తున్నారా అంటూ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు మార్కెట్ యార్డ్ సెక్రటరీపై చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇక నుంచి రైతులను మోసం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే రైతు సంఘం, సిపిఐ నాయకులు చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీష్, మల్లికార్జున, జిల్లా కార్యదర్శి జాఫర్, పండ్ల తోటల రైతు సంఘం నాయకులు అనంత రాముడు ఉన్నారు.


మార్కెట్ యార్డులో చీనీ రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

# జగన్.. ఫ్యాక్షన్ రాజకీయాలు మానుకో..

## ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఫ్యాక్షన్ రాజకీయాలు పుట్టింది జగన్ ఇంట్లోనేనని, ఆ ఫ్యాకన్ రాజకీయాలను రాష్ట్రమంతా తేవాలని జగన్ చూస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని ఎపిఎస్ ఆర్టీసీ రాయలసీమ జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 మంది బిసిలు జగన్ మనుషుల ద్వారా హత్యలకు గురైనప్పుడు జగన్ ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. నాడు నీవు చేసినట్టు నేడు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తే నీవు ఒక్కరోజు కూడా బయట తిరిగే స్థితి ఉండేది కాదన్నారు. ఎన్నికల్లో 64 శాతం మంది ప్రజలు నిన్ను ఛీకొట్టారన్నారు. నీకు పదవి, ప్రతిష్ట ఉంటే బయటికి రాకూడదన్నారు. మెజారిటీ ఓట్లతో గెలిచిన ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని, దేనికైనా సహకరించాలి లేకుంటే గమ్మున ఉండాలన్నారు. అనవసరమైన రాజకీయాలు చేయవద్దని నాగరాజు జగన్‌కు హితవు పలికారు.

**ఆర్టీసీ డిపో తనిఖీ**

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, డిపోను బుధవారం కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు సందర్శించి బస్టాండ్, డిపో పరిస్థితులను డిపో మేనేజర్ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయుఎ నాయకులు తిప్పేస్వామి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు లింగ మయ్య, కార్గో ఇన్‌ఛార్జ్ నాగరాజు, తదితరులు మాట్లాడుతూ ఆపేసిన సర్వీసులను పునరుద్ధరించాలని, శిథిలావస్థలో ఉన్న బస్టాండ్ మరమ్మతులు చేయడం లేదా కొత్త బస్టాండ్ నిర్మించాలన్నారు. డిపోకు కొత్త బస్సులు, కొత్త సర్వీసులు తీసుకురావాలన్నారు. కార్గో కంటైనర్ సౌకర్యం కల్పించాలని కోరారు. వీటిపై స్పందించిన పూల నాగరాజు బస్టాండ్‌ను తాత్కాలికంగా మరమ్మతులు చేసి త్వరలో నూతన భవనం నిర్మిస్తామన్నారు. అధికారులతో చర్చించి పాత సర్వీసులను పునరుద్ధరించడంతో పాటు, కొత్త సర్వీసుల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అంతర్రాష్ట్ర రవాణా సర్వీసులపై రెండు రాష్ట్రాల అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఇంజినీర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.


ఆర్టీసీ డిపోలో సమస్యలు తెలుసుకుంటున్న జోనల్ చైర్మన్ పూల నాగరాజు


రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ మునివేలు

# జాయింట్ ఎల్‌పిలను విభజిస్తాం

## తహశీల్దార్ మునివేలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

రైతులు చలానా కట్టి ముందుకొస్తే జాయింట్ ఎల్‌పిలను విభజిస్తామని తహశీల్దార్ మునివేలు సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం తహశీల్దార్ రైతులతో మాట్లాడుతూ మండలంలో జాయింట్ ఎల్‌పి సమస్యలు ఉన్నాయన్నారు. రైతులందరూ సమ్మతించి కొంత భూమి తగ్గినా, పెరిగినా సర్దుబాటు చేసుకుంటామంటే జాయింట్ ఎల్‌పిలను సర్వే చేసి విభజిస్తామన్నారు. రైతుల సహకారం లేకుండా తామేమీ చేయలేమని కొలగానహళ్లి రైతులకు తెలిపారు. వేదావతి నది పరివాహక భూముల్లో రైతులు కేవలం పంటలు సాగు చేయవచ్చు కానీ రెవెన్యూ రికార్డుల్లో పొందపరచడం సాధ్యం కాదన్నారు. ఒకవేళ ఎవరైనా నది పరివాహక భూములను సాగు చేస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేయించడం, బ్యాంకు రుణాలు పొందడం చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు.

# నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని ఎంపిడిఒ కార్యాల యంలో గురువారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ ఉంటుందని ఎంపిడిఒ కొండన్న తెలిపారు. ఇందులో మండల అధికారులందరూ పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వాలన్నారు.

# నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-గుత్తి

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకూ గుత్తి 220 కెవి విద్యుత్ ఉపకేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్ల మార్పుల కారణంగా ఆయా రోజుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పద్మనాభయ్య పిళ్ళై బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు జరిగే సమయంలో 2 నుంచి 4 గంటల వరకు విద్యుత్‌ను సరఫరాను నిలిపివేస్తామని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# కుట్టు మిషన్‌తో మహిళలకు ఉపాధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శింగనమల

శింగనమలలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ(టైలరింగ్) కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కుటుంబ పోషణలో మహిళల పాత్ర చాలా కీలకమని, వారు స్వయం ఉపాధి పొందే దుకు ఉచిత కుట్టుశిక్షణ ఎంతో ఉపయోగ పడుతుం దన్నారు. నియోజకవర్గానికి 500 కుట్టు మిషన్లు మంజూరయ్యాయని, రాబోయే రోజుల్లో మరిన్ని కుట్టుమిషన్లు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. బాధ్యతగా పని చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపిడిఒ భాస్కర్, తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య, సిడిపిఒ ఉమాశంక రమ్మ, టిడిపి మండల కన్వీనర్ ఆదినారాయణ, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, డేగల కృష్ణమూర్తి, మారుతినాయుడు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను ఎమ్మెల్యే శ్రావణిశ్రీ సందర్శించారు. వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. టిడిపి నాయకులు పట్నం నాగేష్ రూ. 30 వేల విలువ చేసే ఫ్రిజ్‌ను అందజేయగా ఎమ్మెల్యే ప్రారంభిం చారు. పట్నం నాగేష్‌ని వైద్య సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రోహిత్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ఆంజనేయులు నాయక్, డాక్టర్ పుష్పలత, వైద్య సిబ్బంది, అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

# పౌష్టికాహారం తీసుకోవాలి : సిడిపిఒ

ప్రజాశక్తి -పెద్దపప్పూరు

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సిడిపిఒ షాజిదా బేగం సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో బుధవారం సిడిపిఒ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కడుపులో పెరిగే పిల్లలు, పాలు తాగే పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారన్నారు. ఆరోగ్య సమస్యలు, పోషణ్ ట్రాకర్ అప్‌లో ఎలా నమోదు చేసుకోవాలో అవగాహన కల్పించారు. వైద్యులు ఉన్నతి ఆధ్వర్యంలో మాతృ యోజన పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో నారాయ ణమ్మ, రామలక్ష్మి, పల్లవి, ఆశా కార్యాకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ

# నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన పూజలు

ప్రజాశక్తి-శింగనమల

మా తల్లిదండ్రులు ఆలూరు నారాయణమ్మ, ఆలూరు సుంకిరెడ్డి జ్ఞాపకార్థం బుక్కరాయ సముద్రం మండలంలోని రోటరీపురం గ్రామంలో సొంత నిధులు రూ. 30 లక్షలతో శ్రీసీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఆలయం నిర్మించడం అదృష్టంగా భావిస్తున్నామని వైసిపి ఐటి వింగ్ చైర్మన్ ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ఆలూరు రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయంలో బుధవారం నుంచి విగ్రహ ప్రతిష్టాపన పూజలు, తదితర కార్యక్రమాలు ఉంటాయని ప్రజలు పెద్దఎత్తున పాల్గొని భగవంతుని ఆశీర్వాదాలు పొందాలని కోరారు. బుధవారం శ్రీసీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహ ఆరోహణం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారంలి అభిషేకం, శుక్రవారం విఖ్యాత విగ్రహ ప్రతిష్టాపన, సాయంత్రం కళ్యాణోత్సవం, శనివారం శ్రీసీతారాముల గ్రామోత్సవం, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి


బదిలీపై వెళ్తున్న ఎఎస్‌ఐను సత్కరిస్తున్న పోలీసు సిబ్బంది

# బదిలీ ఎఎస్‌ఐ, సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి-యల్లనూరు

యల్లనూరు పోలీస్ స్టేషన్‌లో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ఎఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్, పోలీసులు జనార్ధన్ నాయక్, గంగభవానీలను బుధవారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో సన్మానించారు. ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఐలు నారాయణ రెడ్డి, సంపత్ కుమార్, ఆదిరెడ్డి, బాలరాజు, వెంకటేష్, జమీందర్ వెంకటేష్, హోంగార్డ్‌లు రవీందర్ రెడ్డి, రామనాథ్ పాల్గొన్నారు.

# శ్రీలక్ష్మీచెన్నకేశవుని సన్నిధిలో అధికారులు

ప్రజాశక్తి-యాడికి

యాడికిలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాన్ని బుధవారం పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రజిత సందర్శించారు. వారికి అర్చకులు హరినాథశర్మ, వేద ఆశీర్వాదాలు ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. రజిత మాట్లాడుతూ పురాతన ఆలయ వైశిష్టాన్ని అర్చకులు చక్కగా వివరించారన్నారు. పడమర వైపు ఉన్న పురాతన సత్రం శిథిలావస్థకు చేరుకుందని, దాని స్థానంలో నూతన మండపం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఆమె వెంట టెక్నికల్ అసిస్టెంట్ మహేంద్రనాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, నాయకులు వేలూరు రంగయ్య, గోపాలనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు మద్దాల సుబ్రహ్మణ్యం, బంగారు బాల, తాండ్ర విక్రమ్, పల్లా చిదంబరి, దాసరి పాండు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-ఆత్మకూరు


మండలంలోని వై.కొత్తపల్లి గ్రామంలో బుధవారం ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు సభ్యత్వాల నమోదు కార్యక్రమం చేపట్టారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలు, గిట్టుబాటు ధర, తదితర అంశాలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేసి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు, మండల కార్యదర్శి రాము, సరోజమ్మ, తదితరులు రైతులు పాల్గొన్నారు.


రైతు సభ్యత్వాలు చేపడుతున్న ఎపి రైతు సంఘం నాయకులు

# జెడ్పీలో పలువురికి ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి అనంతపురం రూరల్

జడ్పీ, జడ్పీ ఛైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయాల్లో పని చేస్తున్న పది మంది జూనియర్ సహాయకులకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ బుధవారం జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో బి.సుశీల-పిఆర్ క్యు.సి. సబ్ డివిజన్, పెనుకొండ, జె.సుబ్రహ్మణ్యం-ఎంపిపి లేపాక్షి, పి.మహేష్-ఎంపిపి కణేకల్లు, పి.ఉమామహేశ్వర్‌రెడ్డి- ఆర్‌డబ్ల్యుఎస్ సబ్ డివిజన్, గుత్తి, కె.రమాదేవి -ఎంపిపి చిలమత్తూరు, జి.రవీంద్ర-పిఆర్ పిఐయు డివిజన్-పుట్టపర్తి, పి.షహీనా బేగం-ఎంపిపి రొద్దం, ఎం.అరుణ-ఎంపిపి యల్లనూరు, డి.మాధవి- జడ్పీ, అనంతపురము, వి.విశ్వనాథ్-పిఆర్‌ఐ సబ్ డివిజన్, మడకశిరకు ఉత్తర్వులు అందుకున్నారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉద్యోగోన్నతులు పొందిన వారు మరింత భాధ్యతగా పని చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిం చాలని దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఉద్యోగోన్నతులు పొందిన వారు ఛైర్‌పర్సన్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ సిఇఒ రామచంద్రారెడ్డి, ఎ-సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.


ఉద్యోగోన్నతి పత్రాలు అందుకున్న ఉద్యోగులతో జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ



అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలుపుతున్న కార్మికులు

# 'శ్రీరామిరెడ్డి'కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

బకాయి వేతనాలు, పిఎఫ్, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లిన విషయం తెలిసిందే. సమ్మెలో భాగంగా నాల్గో రోజైన బుధవారం కార్మికులు పట్టణంలోని పంప్ హౌస్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మెను విరమింపజేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

# 'బీసీ సమరభేరి' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుత్తి


బిసిలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీఎస్పీ రాయలసీమ జిల్లాల ఇన్‌ఛార్జి గద్దల నాగభూషణం డిమాండ్ చేశారు. పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ విగ్రహం వద్ద బుధవారం 'బీసీ సమరభేరి' పోస్టర్లను విడుదల చేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగభూషణం మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఈ నెల 11వ తేదీ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతపురం జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే కార్యక్రమానికి బీసీలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి విజయ్, నాయకులు బి.వెంకట కొండయ్య, బండల రామాంజనేయులు, శ్రీపురం సుధాకర్, ఓబులేసు, కరీం, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

# శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఆదిమూర్తినగర్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఐఎన్‌టిఎస్ఒ పరీక్షలో సత్తా చాటారు. దీంతో బుధవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎజిఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ప్రథమ స్థానం సాధించిన నంజుండ సాయిరోహిత్(5వ తరగతి), మనీషా(9వ తరగతి)లకు లెనోవా ట్యాబ్‌లు అందచేశారు. అలాగే ద్వితీయ బహుమతి ఒకరికి, తృతీయ బహుమతి ఇద్దరికి, నాల్గో బహుమతి ఇద్దరికి, ఐదో బహుమతి ఇద్దరికి, కన్సొలేషన్ బహుమతులు 24, స్పెషల్ బహుమతులు 8 సాధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శాంత, జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ తిరుమలేశ్వరరెడ్డి, ప్రైమరీ జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ పూజ, డీన్ గంగాధర్, ప్రైమరీ, ప్రీ-ప్రైమరీ ఇన్‌ఛార్జులు దీప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముస్లింల దీక్షలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి

# ముస్లిముల నిరసన దీక్షకు ఎపి రైతు సంఘం సంఘీభావం

ప్రజాశక్తి-తాడిపత్రి

వక్ఫ్ బిల్లు సవరణకు వ్యతిరేకంగా పట్టణ ముస్లింలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఎపి రైతు సంఘం నాయకులు రాజారామ్‌రెడ్డి, శిరీష సంఘీభావం తెలిపారు. వక్ఫ్ బిల్లు సవరణకు వ్యతిరేకంగా పట్టణంలోని అశోక పిల్లర్ వద్ద ముస్లింలు చేపట్టిన నిరవధిక నిరసన బుధవారం కూడా కొనసాగింది. నాయకులు రాజారామ్‌రెడ్డి, శిరీష మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం వక్ఫ్ బిల్లు సవరణతో మైనారిటీ హక్కులను హరిస్తోందన్నారు. ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ దాడులు చేస్తుందన్నారు. దీనిని ముస్లింలే కాదు మొత్తం లౌకిక శక్తులు సమైక్యంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అలివేలమ్మ

# 'ఉపాధి' కూలీల సంఖ్య పెంచండి

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపిడిఒ అలివేలమ్మ టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. అందులో ఫారంపాండ్లు తవ్వాలని, కూలీలకు రోజుకు కనీసం రూ. 300 వేతనం వచ్చేలా పనులు కల్పించాల న్నారు. హౌసింగ్ 90 రోజులు, ఇంకుడు గుంతలు, పశువుల షెడ్స్ పనులు త్వరగా పూర్తి చేయాలని బిఎఫ్‌టి, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. సమావేశంలో ఎపిఒ నరేంద్ర, టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

## ఈసీగా అంజన్‌కుమార్

ఉపాధి హామీ ఈసీగా అంజన్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ టిఎ విజయ్‌కుమార్‌రెడ్డి ఇన్‌ఛార్జి ఈసీ పని చేసేవారు. ఆయన నార్పలకు బదిలీ కాగా గుమ్మఘట్టలో పని చేస్తున్న అజయ్‌కుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.





ఎన్నికైన పిఎస్‌ఎఫ్ఐ నియోజకవర్గ నూతన కార్యవర్గం

# పిఎస్‌ఎఫ్ఐ నియోజవర్గ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(పిఎస్‌ఎఫ్ఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతిభా భారతి ఆధ్వర్యంలో నియోజవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా చిరంజీవి, అధ్యక్షులుగా హిరణ్య, కమిటీ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ నియోజవర్గంలోని విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కరువు జిల్లాలో అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలని, ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, ప్రభుత్వ హాస్టల్స్‌కు శాశ్వత భవనాలు నిర్మించాలని, సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలని, విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాల అమ్మకాన్ని పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సభ్యులు కుళ్లాయి స్వామి, దేవేంద్ర, షమ్ము, ఛత్రపతి, సాయిచరణ్, రవితేజ, ప్రిన్స్, పాల్గొన్నారు.

# ఎస్సీ భూముల ఆక్రమణపై డీఎస్పీ విచారణ

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎస్సీల భూములు ఆక్రమించుకున్నట్లు అందిన ఫిర్యాదుపై బుధవారం డీఎస్పీ మహబూబ్‌బాషా కూడేరు మండలంలోని కడదరగుంట గ్రామంలో బాధితులతో కలిసి విచారణ చేపట్టారు. విచారణలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నెరమెట్ల ఎల్లన్న, రామాంజనేయులు, ఎమ్మెస్ ఎఫ్ రాష్ట్ర నాయకులు నగేష్, రామచంద్ర, బాధితురాలు ఆదిలక్ష్మి, సునీత, వెంకటేష్, రమేష్, రామచంద్ర, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య

**పుట్లూరు :** కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం మండలంలోని గాండ్లపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గాండ్లపాడు గ్రామానికి చెందిన జాలి రమేష్‌రెడ్డి భార్య భగవతి(25) బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి చెల్లెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉరేసుకుని వృద్ధుడు...

**బెళుగుప్ప :** జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మృతుడు కుమారుడు హనుమంతు ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివ తెలిపిన వివరాలు.. మండంలోని భూది భక్తి గ్రామానికి చెందిన ఆంజనేయులు(60)కు మతి స్థిమితం సరిగా లేకపోవడం, అనారోగ్య సమస్యలతో కొన్ని రోజులుగా బాధపడుతూ ఉండేవాడు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతడు ఊరి బయట ఉన్న ఓ చింత చెట్టుకు ఉరి వేసుకున్నాడు. తెల్లవారుజామున పొలాలకు వెళ్లిన రైతులు గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని కిందకు దించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఆ గ్రామం వెళ్లి వివరాలు ఆరా తీశారు. మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుకి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ శివ తెలిపారు. ఆంజనేయులు మృతితో భార్య లలితమ్మ, కుమారుడు హనుమంతు, ఇద్దరు కూతుళ్లు బోరున విలపించారు.

## 11, 12 తేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పుట్లూరు :** 220 కెవి గుత్తి సబ్ స్టేషన్‌లో తాడిపత్రి ఫీడర్‌కు సంబంధించిన 220 కెవి బ్రేకర్ మారుస్తు న్నందు వల్ల ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం 1 గంట నుంచి 12వ తేదీ రాత్రి 8 గంటల వరకూ విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఏఈ అక్బర్ తెలిపారు. కావున తాడిపత్రి, యాడికి, పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు మండలాల ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

## నీటి వనరులు, పరిస్థితి, వినియోగంపై శిక్షణ

**పుట్లూరు :** చిన్న నీటి వనరులు, జలాశయాల గణన నిర్వహణపై బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మైనర్ ఇరిగేషన్ సెన్సస్ ఛైర్మన్ అయిన తహశీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. గణకులు అయిన గ్రామ రెవెన్యూ అధికారులకు సహ గణాంక అధికారి శిక్షణ ఇచ్చారు. ఈ గణన వల్ల నీటిపారుదల, నీటి వనరుల పరిస్థితి, వినియోగం, పంపిణీని అంచనా వేస్తారు. జల వనరుల గణన స్థానం, యాజమాన్యం, పరిస్థితి, వినియోగం, ఆక్రమణలు, నీటి విస్తరణ ప్రాంతం పై సమాచారం సేకరిస్తారని తహశీల్దార్ వివరించారు.

# శక్తి యాప్ పై అవగాహన

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

మహిళల భద్రత కోసం రూపొందించి అమలు చేస్తున్న "శక్తి యాప్"పై రూరల్ పోలీసులు బుధవారం స్థానిక సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ పోలీసులు మాట్లాడుతూ "శక్తి యాప్" మహిళల భద్రతకు ఉపయోగపడుతుందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చి రక్షణ పొందవచ్చని తెలియజేశారు. ఫోన్ లొకేషన్ ఆధారంగా 10 నిమిషాల వ్యవధిలో పోలీసులు బాధితుల వద్దకు చేరుకుని వారికి భద్రత కల్పిస్తారన్నారు. దీనిలోని హ్యాండ్ షేక్ ఆప్షన్‌ను ఇనేబుల్ చేసుకుంటే ఆపద సమయంలో ఫోన్‌ను షేక్ చేస్తే దగ్గరలోని పోలీసులకు సమాచారం వెళుతుందన్నారు. మహిళలు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పోలీసుల రక్షణ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు


# ప్రాధాన్యతాక్రమంలో సమస్యలు పరిష్కారం : ఎమ్మెల్యే



వార్డులో మహిళ సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్**

ఎన్నికల హామీ మేరకు నగరంలోని సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నా మని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే బుధవారం స్థానిక కార్పొరేటర్ జనబలం బాబా, మున్సిపల్ కమిషనర్ బాలాస్వామి, ఇతర అధికారులతో కలిసి 12వ డివిజన్‌లో 'మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. మరికొన్నింటిని నిర్దిష్ట కాల వ్యవధిలో పరిష్కరించాలని అధికారులకు సూచిం చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో నగరాన్ని సమస్యలకు నిలయంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం డ్రెయినేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి రూ. 750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించా మన్నారు. అక్టోబర్ 2వ తేదీ లోపు డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే స్థల సేకరణ కూడా జరిగిందని, పూర్తిస్థాయిలో చెత్తను అక్కడి నుంచి తరలిస్తామన్నారు. నడిమివంక, మరువవంకల ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం చేపడతామని, ఇందుకోసం రూ. 88 కోట్లతో అంచనాలు సిద్ధం చేశామ న్నారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న అన్ని రోడ్లు, డ్రెయినేజీల పనులు చేపడతామన్నారు.

**15 రోజుల్లో పార్టీ పదవులు ప్రకటిస్తాం**

మరో 15 రోజుల్లో పార్టీ పదవులు ప్రకటిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. నగరంలోని టిడిపి అర్బన్ కార్యాలయంలో ప్రజాదర్బార్-కార్యకర్తలు, ప్రజల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పలు డివిజన్లో ఉన్న సమస్యలను నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొ చ్చారు. పార్టీలో ఉన్న ఇబ్బందులపై ఎమ్మెల్యేతో చర్చించారు. సిఐటియు నాయకులు పలు సమస్యల ను విన్నవించగా వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం టిడిపి సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీని ఎమ్మెల్యే దగ్గుపాటి, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ లాంఛనంగా ప్రారం భించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నా గెలుపు కోసం పని చేసినా, చేయకపోయినా టిడిపి కోసం కష్టపడి కేసులు ఎదుర్కొని, నష్టపోయిన వారందరికీ న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. పార్టీలో ఆ గ్రూపు ఈ గ్రూపు అంటూ ఏవీ లేవని.. ఉన్నది టిడిపి గ్రూపు మాత్రమే అన్నారు. ఆయా కార్యక్రమాల్లో కోనంకి గంగారామ్, తలారి ఆదినారాయణ, రాయల్ మురళి, రంగాచారి, బాలాంజ నేయులు, సరిపూటి రమణ, గుర్రం నాగభూషణం, ముక్తియార్, పావురాల శేఖర్, పిఎల్ఎన్.మూర్తి, పరమేశ్వర్, పోతుల లక్ష్మీనరసింహులు, సాకే లక్ష్మీ నరసింహ, సుధాకర్‌యాదవ్, బొమ్మినేని శివ, ఫిరోజ్ అహ్మద్, మోహన్ కుమార్ పాల్గొన్నారు.

# ఫాదర్ ఫెర్రర్ ఆశయాలను కొనసాగిద్దాం

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం**

పేదల బతుకుల్లో వెలుగులు నింపడమే ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆశయమని, ఆయన ఆశయాలను కొనసాగిద్దామని ఆర్‌డిటి సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మ్యాంచో ఫెర్రర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం ట్రస్ట్ ఫౌండర్ బద్దేనాయక్ ఆధ్వర్యంలో విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మ్యాంచో ఫెర్రర్, బద్దేనాయక్‌తో కలిసి ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మ్యాంచో మాట్లాడుతూ బద్దేనాయక్ ఫాదర్ ఫెర్రర్ అడుగుజాడల్లో నడుస్తూ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామా జిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బద్దేనాయక్ మాట్లాడుతూ మాలాంటి ఎంతోమంది పేదల బతుకుల్లో ఆర్‌డిటి వెలుగులు నింపిందన్నారు. అనంతరం ఆర్‌డిటి సంస్థకు రూ. లక్ష చెక్కును అందజేశారు. బోరంపల్లి మహేంద్రకు ప్రతి నెలా తరహాలోనే ఈ నెలా రూ. 12వేల చెక్కును వైద్య ఖర్చులకు అందేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సురేష్, హరీష్, అబ్దుల్, చాపిరి తిప్పేస్వామి, కంబాల తిమ్మారెడ్డి, ఈరన్న, ఎంఎస్.రాయుడు, సాయినాథ్, మహాలింగ, వెంకటంపల్లి గ్రామస్తులు, మహిళ, ప్రజా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మాంఛూఫెర్రర్‌కు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న బద్దె నాయక్

**పామిడి :** స్థానిక విశాల ఫెర్రర్ వికలాంగుల మండల సమాఖ్య భవనంలో ఆ సమాఖ్య సభ్యుల ఆధ్వర్యంలో విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫెర్రర్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో సమాఖ్య మండల అధ్యక్షుడు కేశవాచారి, సెక్రెటరీ సర్వేష్, జాయింట్ సెక్రెటరీ నాగభూషణం, సభ్యులు నరసింహులు, శివన్న, రాజేష్, వంకరాజుకాల్వ కేశవ, వడ్డే లక్ష్మయ్య, కత్రిమల లక్ష్మీదేవి, మాబాషా, మల్లి పాల్గొన్నారు.

**ఉరవకొండ :** ఆర్‌డిటి వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సేవలను కొనసాగిద్దామని ఎస్సీ, ఎస్టీ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ సాకే భాస్కర్ పేర్కొన్నారు. జెఎసి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ కూడలిలో ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జెఎసి సమన్వయకర్త మీనుగ గోపాల్, కన్వీనర్ మధుప్రసాద్, ట్రెజరర్ దుర్గాప్రసాద్, రాజశేఖర్, కోకన్వీనర్లు పృథ్వీరాజ్, పురుషోత్తం, చంద్రశేఖర్, చెన్నప్ప, సభ్యులు ఎర్రిస్వామి, యల్లన్న, నాగేష్, చక్రవర్తి, వీరప్ప, హల్లెప్ప, నాగేంద్ర, సుంకప్ప, మారెన్న, పెద్ద ఓబులేసు, చిన్న ఓబులేసు, రామాంజనేయులు, నాగరాజు, మారెప్ప, హనుమన్న పాల్గొన్నారు.

**నార్పల :** స్థానిక ఆర్‌డిటి కార్యాలయంలో విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిద్దిరాచర్ల పంచాయతీలోని దుర్గం గ్రామంలో కూడా జయంతి వేడుకలు నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆర్‌డిటి ఛైర్మన్ తిప్పేస్వామి, జడ్పిటిసి నాగరత్నమ్మ, సిద్దిరాచర్ల సర్పంచి రామాంజనేయులు, సిపిఐ నాయకులు కుళ్లాయప్ప, ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరాగాంధీ ఆశయాల సాధనకై పోరాడుతాం

## ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్




ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

**ప్రజాశక్తి-అనంతపురం**

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయాల సాధనకు పోరాడుతామని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ యనుమల తెలిపారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ చెన్నవరం ఆధ్వర్యంలో బుధవారం నగరంలో ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నరేష్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా విస్తృత పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇకనైనా ఈ ఫాసిస్ట్ మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం అమలును ఉపసంహరించుకోవాలని, లేనిచో దేశవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లక్ష్మిపతినాయక్, దక్షిత, హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.



సామూహిక సీమంతాల్లో పాల్గొన్న మహిళలు

# బిడ్డకు తల్లిపాలే రక్ష : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-శింగనమల**

పుట్టబోయే బిడ్డకు తల్లిపాలే రక్ష అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ పక్షోత్సవాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, తల్లిపాల ప్రాముఖ్యత, ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత, తదితర అంశాల గురించి వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, 6 నెలలు పూర్తయిన పిల్లలకు అన్నప్రాసన వంటి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపిఒ ఉమాశంకరమ్మ, ఎంపిడిఒ భాస్కర్, తహశీల్దార్ బ్రహ్మయ్య, సూపర్వైజర్లు కౌసల్య, ధనలక్ష్మి, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

**రాప్తాడు :** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ శివకృష్ణ ఆధ్వర్యంలో గర్భిణులకు బిపి, షుగర్, హెచ్‌బి, యూరిన్, తదితర పరీక్షలు నిర్వహించారు. క్రమం తప్పకుండా నెలసరి పరీక్షలు చేయించు కోవాలని, పౌష్టికాహారం, ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, స్టాఫ్‌కు సిద్దప్ప, మహబూబ్‌బాషా, మహబూబ్‌బీ భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నరసింహ, అరుణ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రధానాచార్యులు డాక్టర్ టి.విజయ లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి కోర్సులు ఉన్నాయని, ఈ ఏడాది కొత్తగా ఎంబైపిసిని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వృత్తి విద్య కోర్సులైన సెరికల్చర్, బిఆర్ఎం, సిఎస్ఈ, ఏఅండ్‌టి, సిఈటి, ఎంఎల్‌టి, గ్రూపులకు అడ్మిషన్లు, తరగతులు ప్రారంభించినట్లు ఆమె తెలిపారు.

# పేదలు, విద్యార్థులకు అన్నదానం

**ప్రజాశక్తి-అనంతపురం**

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు, గురుసదన్ ఆశ్రమంలో విద్యార్థులకు ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్. ఎస్.నిర్మలమురళి అన్నదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు ఆర్.శ్రీనివాసులు(హుబ్లీ ఎయిర్ పోర్ట్ డిజిఎం) భార్య శ్రీలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో మొత్తం 150 మందికి అన్నదానం చేసినట్లు నిర్మలమురళి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సుబ్రహ్మణ్యం, కిష్టప్ప, లక్ష్మీనారాయణ, మణిదీప్, ఎల్‌వి.రంగారెడ్డి, టిఎన్.అప్పాజీ, యు.సురేంద్ర కుమార్, ఎస్‌బిఐ పెన్షనర్స్ క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని బుధవారం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ పాల్ రవికుమార్ సందర్శించి వివిధ విభాగాల్లో వైద్యులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. కాన్పులు, ఆరోగ్యశ్రీ విభాగం పనితీరును, సదరం సర్టిఫికెట్ల జారీని తనిఖీ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. హాజరులో మౌఖిక గుర్తింపు నమోదు చేయాలన్నారు. డ్యూటీ డాక్టర్లు 24/7 రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వారం రోజుల్లో వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మెర్సీ జ్ఞాన సుధ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యులతో సమావేశం అయిన డాక్టర్ పాల్ రవికుమార్